క్లుప్తంగా

నేడు విద్యుత్ అంతరాయం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పట్టణంలోని 11కేవీ నర్సాపూర్ ఇండ్రస్ట్రీయల్ ఫీడర్ పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సిద్దిపేట అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ సుధాకర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నర్సాపూర్, నర్సాపూర్ బైపాస్ ప్రాంతాలలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

సాగుపై అప్రమత్తం



మాట్లాడుతున్న శాస్త్రవేత్త

గజ్వేల్: వానాకాలం సాగులో రైతులు అప్రమత్తంగా వ్యవహరించాలని మెదక్ జిల్లా తునికిలోని కృషివిజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ రవి, రమేశ్ నాయక్, నేషనల్ అకాడమీ ఆఫ్ అగ్రికల్చర్ రీసెర్చ్ మేనేజ్‌మెంట్(ఎన్ఏఏఆర్ఎమ్) శాస్త్రవేత్తలు డాక్టర్ జాగృతి సూచించారు. మండలంలోని పిడిచెడ్, ర్యాగట్లపల్లి గ్రామాల్లో శనివారం వారు పర్యటించి రైతులకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కిసాన్ యాప్ ద్వారా ఎప్పటికప్పుడు వాతావరణ సూచనలు పొందవచ్చునన్నారు. వ్యవసాయంలో డ్రోన్‌ల ఉపయోగాల గురించి వివరించారు. ఏఈఓ గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వాతి నక్షత్రోత్సవం

సిద్దిపేటరూరల్: పుల్లూరు లక్ష్మీనరసింహ స్వామి క్షేత్రంలో ఘనంగా నరసింహస్వామి జన్మనక్షత్రమైన స్వాతి నక్షత్రోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమం నిర్వహించారు. అనంతరం అర్చకుడు రంగాచారి మాట్లాడుతూ ప్రతీనెల స్వాతినక్షత్ర ఉత్సవం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో అర్చకులు శ్రీనివాసాచార్య, రామకృష్ణ, శ్రీనివాస్, వెంకట్, నచికేత, సంపన్, రుత్విక్, సాయికృష్ణ, భక్తులు పాల్గొన్నారు.

శంకరాచారికి ఘన సన్మానం



శంకరాచారిని సన్మానిస్తున్న హరికృష్ణ

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని గుగ్గిల్ల గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు, 'నా గమ్యం ఐఏఎస్' రచయిత నారోజు శంకరాచారిని శుక్రవారం హైదరాబాద్‌లోని ప్రభుత్వ భాషా సాంస్కృతికశాఖ కార్యాలయంలో సంచాలకుడు డాక్టర్ మామిడి హరికృష్ణ శాలువా కప్పి సన్మానించారు. 'నా గమ్యం ఐఏఎస్' పుస్తకాన్ని తెలుగులో రాసినందుకుగాను ఆయనను అభినందించారు. కార్యక్రమంలో అపర్ణ ఫౌండేషన్ అధ్యక్షుడు ఎడవెల్లి హరీశ్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దమ్మ తల్లికి పూజలు



అమ్మవారి సన్నిధిలో సతీశ్‌కుమార్ తదితరులు

అక్కన్నపేట(హుస్నాబాద్): మండల కేంద్రంలో అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపనతోపాటు చౌటపల్లిలోని పెద్దమ్మ తల్లిని శాసన మండలి వైస్ చైర్మన్ బండ ప్రకాశ్, మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్ శనివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారిద్దరికి ఆలయ నిర్వాహకులు, గ్రామస్తులు స్వాగతించి సత్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ సమృద్ధిగా వానలు కురవాలని వేడుకున్నట్లు చెప్పారు. సాయంత్రం చౌటపల్లిలో పెద్దమ్మ తల్లికి ముదిరాజ్ కులస్తులు, గ్రామస్తులు బోనాలతో ఊరేగించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ రాజిరెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు పెసరు సాంబరాజు, నాయకులు గంగాధరి రాజయ్య, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడి - అమ్మఒడి



బడిబాట కార్యక్రమంలో ఎంఈఓ, టీచర్లు

దౌల్తాబాద్(దుబ్బాక): ప్రభుత్వ బడి.. అమ్మఒడి లాంటిదని మండల విద్యాధికారి గజ్జెల కనకరాజు అన్నారు. శనివారం ఆయన బడిబాట కార్యక్రమం పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పాఠశాలలో అందించే యూనిఫారాలు, పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్న భోజనం గురించి వివరించారు. ప్రతి ఒక్కరు తమ చిన్నారులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు జ్యోతి, ఉపాధ్యాయులు దేవిసింగ్, మంజుల, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

సాగుకు సన్నద్ధం

ముమ్మరంగా దుక్కులు
- ఎరువులు, విత్తనాలు సిద్ధం
- 30 వేల ఎకరాల్లో సాగు

వర్షాకాలం సాగుకు రైతులు సన్నద్ధం అవుతున్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాల నేపథ్యంలో రైతులు వేసవి దుక్కులు దున్ని సిద్ధం చేసుకున్నారు.



వేసవి దుక్కి దున్నుతున్న రైతు

మిరుదొడ్డి(దుబ్బాక): గ్రామాల్లో పశువులు అందుబాటులో లేకపోవడంతో రైతులు యాంత్రిక వ్యవసాయంపై ఆధారపడుతున్నారు. ట్రాక్టర్లతో పొలాలను దున్ని సిద్ధం చేసుకున్నారు. తొలకరి వర్షాల కోసం ఎదురు చూస్తున్న రైతులు ముందస్తుగానే సాగు కోసం విత్తనాలు, ఎరువుల కొనుగోలు కోసం ఫెర్టిలైజర్ షాపుల వద్దకు పరుగులు పెడుతున్నారు.



పొలంలో ఏర్పాటుచేసిన డ్రిప్ పైపులు

30 వేల ఎకరాల్లో సాగు

ముఖ్యంగా ఉమ్మడి మండల పరిధిలో 30 వేల ఎకరాలకుపైగా సాగుకు యోగ్యమైన భూములు ఉండగా వర్షాధారంగా 8,135 ఎకరాల్లో మొక్కజొన్న, 8 వేల ఎకరాల్లో పత్తి, 15 ఎకరాల్లో కూరగాయలు, 450 ఎకరాల్లో కంది, బోరు బావుల కింద 13,485 ఎకరాల్లో వరి సాగుచేసే అవకాశాలు ఉన్నట్లు వ్యవసాయ అధికారులు అంచనా వేస్తున్నారు.

డ్రిప్ ఏర్పాటు

వర్షాకాలంలో వరుణుడు ముఖం చాటేస్తే ఎదురయ్యే సాగు నీటి ఎద్దడిని తట్టుకోవడానికి ముందస్తు చర్యగా బోరు బావుల వద్ద వేసవి దుక్కిలో రైతులు డ్రిప్ పైపులను అమర్చుకుంటున్నారు. సాగునీటి ఎద్దడి ఎదురైతే డ్రిప్ ఇరిగేషన్ ద్వారా నీటిని అందించి పంటలను కాపాడుకోవచ్చని రైతులు చెప్తున్నారు.

ఆరు ఎకరాల్లో దుక్కి సిద్ధం చేశా..



వర్షాకాలంలో పంటలు సాగు చేయడానికి ఆరు ఎకరాల్లో దుక్కి దున్ని సిద్ధం చేశా. రెండేసి ఎకరాల్లో మొక్కజొన్న, పత్తి, వరి సాగు చేద్దామనుకుంటున్న. అందుకు కావాల్సిన ఎరువులు, విత్తనాలను కొనుగోలు చేసి సిద్ధం చేసుకున్న. విత్తనాలను విత్తుకోవడానికి తొలకరి వానల కోసం ఎదురు చూస్తున్న.

– మొగుళ్ల కమలాకర్, రైతు, మిరుదొడ్డి

అందుబాటులో విత్తనాలు



తొలకరి వర్షాలు పడితేనే రైతులు సాగుకు శ్రీకారం చుట్టాలి. ప్రభుత్వం గుర్తించిన అన్ని ఎరువుల దుకాణాల్లోను రైతులకు కావాల్సిన వరి, మొక్కజొన్న, పత్తి, కందులు, పెసర్లు, కూరగాయల విత్తనాలు అందుబాటులో ఉన్నాయి. వర్షాధారంగా సాగుచేసే రైతులు జూన్ 15 నుంచి, జూలై చివరి వారంలోపు విత్తుకోవచ్చు. అదను దాటి విత్తనాలు చల్లుకుంటే సరైన దిగుబడులు వచ్చే అవకాశాలు ఉండవు.

– మల్లేశం, మండల వ్యవసాయ అధికారి, మిరుదొడ్డి

నిలిచిపోయిన నిర్మాణం



నిలిచిపోయిన రెడ్డి సంఘం భవన నిర్మాణం

అసంపూర్తిగా రెడ్డి సంక్షేమ సంఘం భవనం

తొగుట(దుబ్బాక): మండలంలోని వర్దరాజుపల్లి రెడ్డి సంక్షేమ సంఘం భవనం అసంపూర్తిగా నిలిచిపోయింది. రెండేళ్ల గడుస్తున్నా నిధులు మంజూరు కాకపోవడంతో పనులు స్లాబ్ స్థాయిలోనే ఆగిపోయాయి. అప్పటి మెదక్ ఎంపీ, ప్రస్తుత దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి ఈ భవన నిర్మాణానికి పునాదిరాయి వేశారు. ఎంపీ నిధుల నుంచి రూ.5 లక్షలు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. ఎంపీ నిధులు వస్తాయన్న ఆశతో కాంట్రాక్టర్ పనులు చేపట్టి భవనం స్లాబ్ వేశాడు. ఈ క్రమంలో పార్లమెంట్‌కు ఎన్నికలు నిర్వహించారు. దీంతో సాంకేతిక సమస్యలు తలెత్తడంతో నిధులు నిలిచిపోయాయి. ఎంపీ నిధులు మంజూరు కాకపోయినా ఎమ్మెల్యే కోటా నుంచి నిధులు మంజూరుచేసి భవన నిర్మాణం పూర్తిచేసేలా ప్రభాకర్‌రెడ్డి చర్యలు తీసుకోవాలని రెడ్డి సంఘం సభ్యులు కోరుతున్నారు.

ఘనంగా నిర్వహిద్దాం

సిద్దిపేటకమాన్: ఎమ్మార్పీఎస్ 31వ వార్షికోత్సవాన్ని గ్రామ గ్రామానా ఘనంగా నిర్వహిద్దామని ఎంఎస్‌పీ జాతీయ నాయకుడు, జిల్లా ఇన్‌చార్జి కుమార్ తెలిపారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జులై 7న ఎమ్మార్పీఎస్ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలన్నారు. ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల సంస్థాగత నిర్మాణమే లక్ష్యంగా శ్రమిద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రమేశ్, భాస్కర్, పరశురాములు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కుమార్



హుస్నాబాద్‌లోని ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



చిన్నకోదూరులో ముస్లింల ప్రార్థనలు

త్యాగానికి ప్రతీక బక్రీద్

ఈద్గాల వద్ద ముస్లింల ప్రత్యేక ప్రార్థనలు ◆ వెల్లివిరిసిన పండుగ వాతావరణం

బక్రీద్ సందర్భంగా శనివారం జిల్లా వ్యాప్తంగా ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈద్గాల వద్ద భక్తిశ్రద్ధలతో నమాజు చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. బక్రీద్ త్యాగానికి ప్రతీక అని పలువురు మత పెద్దలు అన్నారు. మహ్మద్ ప్రవక్త బోధించిన సమైక్యత, సోదర భావాన్ని అందరూ అనుసరించాలని ఆకాంక్షించారు.



కొమురవెల్లి(సిద్దిపేట): బక్రీద్ సందర్భంగా చిన్నారుల ఆత్మీయ ఆలింగనం



గజ్వేల్‌లో ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతున్న డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి



దుబ్బాకటౌన్: రాయపోల్‌లో...



మద్దూరులోని ఈద్గా వద్ద ముస్లింల నమాజ్



దుబ్బాకలోని ఈద్గా వద్ద ముస్లింల ప్రార్థనలు



ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఏసీపీ రవీందర్‌రెడ్డిని ఆలింగనం చేసుకుంటున్న కలీమొద్దిన్

ఆ భూములపై విచారణ జరపండి

ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్య



దుబ్బాక: జిల్లాలోని భూంపల్లి-అక్బర్‌పేట మండలం చౌదర్‌పల్లిలో అసైన్డ్‌భూముల ఆక్రమణలపై విచారణ జరపాలని రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య కలెక్టర్ మనుచౌదరిని శనివారం ఆదేశించారు. అసైన్డ్ భూముల ఆక్రమణలపై వివిధ పత్రికల్లో వచ్చిన వార్తలను సుమోటగా స్వీకరించి విచారణ జరపాలని కోరారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ భూముల ఆక్రమణలపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి 15 రోజుల్లో కమిషన్‌కు నివేదిక సమర్పించాలని సూచించినట్టు చెప్పారు. అసైన్డ్ భూములు పేదల బతుకుతెరువు కోసం మాత్రమే పంపిణీ చేశాయని గుర్తుచేశారు. పెద్దల చేతుల్లోకి పోయిన భూములను తిరిగి స్వాధీనం చేసుకొని పేదలకే పంపిణీ చేయాలని కోరారు. ఈ భూముల అక్రమాలపై తమ కమిషన్‌కు ఫిర్యాదు చేయాలని కాంగ్రెస్ దుబ్బాక ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డిని, రైతులను పత్రికల ద్వారా కోరినా ఫిర్యాదు చేయలేదన్నారు. సుమోటగా కమిషన్ స్వీకరించి విచారణకు ఆదేశించిందని, ఎస్సీ, ఎస్టీకు అన్యాయం జరిగితే చూస్తూ ఊరుకోబోమని వెంకటయ్య అన్నారు. హక్కుల పరిరక్షణే తమ బాధ్యత అని స్పష్టం చేశారు.

ఆపరేషన్ కగార్ పేరుతో హత్యాకాండ

- ప్రజా సంఘాల నాయకుల నిరసన
- వెంటనే నిలిపివేయాలని డిమాండ్



నినాదాలు చేస్తున్న వామపక్ష నాయకులు

సిద్దిపేటకమాన్: భారత ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరుతో హత్యాకాండ కొనసాగిస్తోందని దానిని వెంటనే నిలిపివేయాలని వామపక్ష, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. అంబేడ్కర్ చౌరస్తాలో సీపీఐ, సీపీఎం, ప్రజాఫ్రంట్, దళిత సంఘాల ఆధ్వర్యంలో శనివారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేసి, కాల్పుల విరమణ ప్రకటించాలన్నారు. మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో మంద పవన్, మల్లారెడ్డి, సత్తయ్య, లక్ష్మణ్, శంకర్, గోపాలస్వామి, చంద్రం, వెంకట్, ప్రశాంత్, రంజిత్, అనిల్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ



విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొన్న నాయకులు, భక్తులు

అక్కన్నపేట(హుస్నాబాద్): మండల కేంద్రంలోని అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠతోపాటు గణపతి నవగ్రహ ప్రతిష్ఠోత్సవం శనివారం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా విగ్రహ వితరణ కార్యనిర్వహణ అధ్యక్షుడు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు పెసరు సాంబరాజు ఆధ్వర్యంలో గ్రామస్తులంతా కుటుంబసమేతంగా హోమంలో పాల్గొన్నారు. భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించి, అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ధాతర్‌పల్లిలో బీజేపీ సంకల్ప సభ



సంకల్ప సభలో పాల్గొన్న బీజేపీ నాయకులు

గజ్వేల్‌రూరల్: కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని బీజేపీ మండల అధ్యక్షుడు పంజాల అశోక్‌గౌడ్ అన్నారు. మండల పరిధిలోని ధాతర్‌పల్లిలో శనివారం నిర్వహించిన మండల సంకల్పసభలో నాయకులు వెంకటరమణ, మధుసూదన్‌తో కలిసి ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. గడిచిన 11 యేళ్లలో ప్రధాని నరేంద్రమోదీ సాహసోపేత నిర్ణయాలతో ముందుకు సాగుతుందని చెప్పారు. ప్రపంచంలోనే నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారతదేశం అవతరించేలా కేంద్ర ప్రభుత్వం పాలన సాగుతోందని గుర్తు చేశారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని మొక్కలు నాటారు. కార్యక్రమంలో అరవింద్, రాజు, చంద్రయ్య, భాస్కర్‌రెడ్డి, ప్రభాకర్, స్వామి, రమాకాంత్, మహేశ్‌చారి తదితరులు పాల్గొన్నారు.

మూడు విడతలలో జమ

బెజ్జంకి(సిద్దిపేట): రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్ల పనులను సకాలంలో చేపట్టి లబ్ధిపొందాలని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఒగ్గు దామోదర్ అన్నారు. మండలంలోని తోటపల్లిలో శనివారం ఆయన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పనులను పరిశీలించారు. వెంటనే పనులు చేపట్టాలని, నిర్మాణ దశలతో మూడు విడతలలో రూ.5లక్షలు అకౌంట్‌లలో జమ చేస్తారన్నారు. నిబంధనలు పాటించి 600 ఫీట్లలోనే ఇంటిని నిర్మించాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు రత్నాకర్‌రెడ్డి, ఐలయ్య, సంతోష్, శ్రీనివాస్‌రావు, మహేశ్, ఓం ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అండగా రెడ్డి సంక్షేమ సంఘం



విద్యార్థులతో రెడ్డి సంక్షేమ సంఘం నాయకులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పేద రెడ్డి విద్యార్థులకు అండగా రెడ్డి సంక్షేమ సంఘం నిలుస్తుందని ఆ సంఘం ప్రతినిధులు అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన రెడ్డి విద్యార్థులను జిల్లా కేంద్రంలోని సంక్షేమ భవనంలో శనివారం ఘనంగా సన్మానించారు. ప్రతి విద్యార్థికి రూ.5వేల నగదుతో పాటు మెమెంటోలు అందించారు. కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షుడు మాణిక్యరెడ్డి, అధ్యక్షుడు వంగ తిరుమలరెడ్డి, ప్రధాన కార్యదర్శి సద్ది నాగరాజురెడ్డి, ప్రతినిధులు రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మమ్మ మరణం బాధాకరం

ఓయూ ఆర్ట్స్ కాలేజ్ ప్రిన్సిపాల్, ప్రొఫెసర్ కాశీమ్



బాపూరావు కుటుంబాన్ని పరామర్శిస్తున్న ప్రొఫెసర్ కాశీమ్ తదితరులు

దుబ్బాక: మండలంలోని గంభీర్‌పూర్‌కు చెందిన సీనియర్ న్యాయవాది బాపూరావు మాతృమూర్తి లక్ష్మమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఓయూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్, ప్రొఫెసర్ చింతకింది కాశీమ్, హైకోర్టు న్యాయవాది స్నేహలత, న్యాయవాదులు రవిబాబు, కనకయ్య, నర్సయ్య, లక్ష్మణ్ తదితరులు శనివారం బాపూరావు కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా లక్ష్మమ్మ మృతికి తమ సంతాపాన్ని తెలిపారు.